ఓవర్‌లోడు.. అందని నీరు

- దాదాపు 70 ఎకరాల్లో ఎండుతున్న పొలాలు
- అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని రైతుల ఆందోళన


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతుల నిరసన


నీరందక ఎండిపోతున్న వరిపొలం

గన్నేరువరం: 'ఎస్ఎస్–14 నంబర్ గల 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో దాదాపు 26 వ్యవసాయ బావులు ఉన్నాయి. సుమారు 70ఎకరాల్లో వేసిన వరిపంటకు నీరందించేందుకు ఈ ట్రాన్స్‌ఫార్మరే ఆధారం. అదనపు లోడ్‌తో తరచూ ఫ్యూజ్‌వైరు పోతుతోంది. విద్యుత్ అధికారులు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలి' అంటూ గన్నేరువరం మండలం గునుకులకొండాపూర్ రైతులు గురువారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆందోళన చేపట్టారు. తరచూ ఫ్యూజ్ పడిపోవడంతో వైర్లు కాలిపోతున్నాయని.. వేసవికాలం నుంచి ఇదే సమస్యను ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. సమస్యను పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు విన్నవిస్తే పట్టించుకోవడం లేదని తెలిపారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ కోసం గద్దెసైతం నిర్మించామని, ట్రాన్స్‌ఫార్మర్ బిగించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. వారం రోజులుగా ఎండలు ఉండడంతో పొలాలకు నీటి అవసరం పెరిగిందని, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలతో తడులు అందించలేని దుస్థితి నెలకొందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ తగ్గించేందుకు రెండు ఫీడర్లుగా విభజించి, రోజు తప్పించి రోజు విద్యుత్ సరఫరా చేస్తున్నారే తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదన్నారు. పొట్టకొచ్చిన వరి ఎండిపోయే పరిస్థితి నెలకొందని, ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు రాజేందర్‌రెడ్డి, అట్టేపల్లి నర్సయ్య, నాలపట్ల నర్సయ్య, కట్ట శేఖర్ కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ ఏఈ ఆంజనేయులును సంప్రదించగా వారం నుంచి పదిరోజుల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.




చొప్పదండి: పట్టణంలోని పదోవార్డు పరిధి గణేశ్‌నగర్‌లో రోడ్లకు ఇరువైపులా గడ్డి, పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో పాములు, తేళ్లు సంచరిస్తున్నాయి. ఉన్న చిన్నరోడ్లను గడ్డి, పిచ్చిమొక్కలు కమ్మేస్తుండటంతోపాటు విషపురుగులు, పాములు సంచరిస్తుండటంతో స్థానికులు రాత్రిపూట బయటకు రావడానికి జంకుతున్నారు. సంబంధిత అధికారులు విధులను శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పెంటి గంగారాం, గణేశ్‌నగర్, చొప్పదండి

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నాగరాజు, చొప్పదండి మున్సిపల్ కమిషనర్, సెల్ నం.: 99492 67882

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9553955664

క్లుప్తంగా

చెరువులో వ్యర్థాలు తొలగించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న శేఖర్‌గౌడ్

మానకొండూర్: చెరువులో నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాల ప్రతిమలు, ఆ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించడంలేదని, బీఆర్ఎస్ మానకొండూర్ మండల అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ కలెక్టర్ పమేలా సత్పతికి మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం వినతిపత్రం అందజేశారు. గ్రామ చెరువులోని వ్యర్థాలను కరీంనగర్ కార్పొరేషన్, మానకొండూర్ జీపీ సిబ్బంది ఇంతవరకూ తొలగించలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు.

వైద్యశిబిరాలు


అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్, డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్, సిబ్బంది

జమ్మికుంట: మండలంలోని వావిలాల పీహెచ్‌సీ డాక్టర్లు కార్తిక్, సంధ్య ఆధ్వర్యంలో నాగంపేట, మడిపల్లి గ్రామాల్లో గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. పలువురికి పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేశారు. ఆరుగురు జ్వర పీడితుల రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. మడిపల్లిలో పారిశుధ్య కార్మికులకు, ధర్మారంలో అంగన్‌వాడీలో పిల్లలకు పరీక్షలు చేసి, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్, ఫర్హానుద్దీన్, హుజూరాబాద్ డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్ బబిత, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, ఏఎన్ఎంలు శ్రీముఖి, తిరుమల, రమ, వాణిశ్రీ, కవిత, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూరాబాద్: పార్లమెంట్ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై బీజేపీ నాయకుల అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆదేశాల మేరకు నాయకులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ నాయకుల తీరును ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో బుద్ధి చెబుతారని అతన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో కొల్లూరి కిరణ్ కుమార్, సొల్లు బాబు, మేకల తిరుపతి, యేముల పుష్పలత, లంకదాసరి లావణ్య, ఎండీ అఫ్సర్,మిడిదొడ్డి రాజు, కొలిపాక శంకర్, రాజు, చల్లూరి రాహుల్, గంట కిరణ్‌రెడ్డి, వాసాల శ్రీనివాస్, సమ్మెట సంపత్, సదానందం, ఈరెల్లి సమ్మయ్య, సునీత, తదితరులున్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలి

జమ్మికుంట: జమ్మికుంట ప్రభుత్వ కళాశాలలో జరిగిన అక్రమాలపై హైదరాబాద్ కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్‌కు ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ కోఆర్డినేటర్ పర్లపల్లి నాగరాజు గురువారం ఫిర్యాదు చేశారు. గతేడాది కళాశాలలో పర్నీచర్, కంప్యూటర్స్, ల్యాబ్ ఎక్విప్‌మెంట్ చోరీ, ఇతర అంశాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించినవారిపై తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

శేఖర్‌రావుకే ట్రస్మా నాయకుల మద్దతు

హుజూరాబాద్: కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, వాల్మీకి విద్యాసంస్థల అధిపతి యాదగిరి శేఖర్‌రావుకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని హుజూరాబాద్ ట్రస్మా నాయకులు గురువారం ప్రకటించారు. ఈ మేరకు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యా సంస్థల అభ్యున్నతి, వాటిపై ఉపాధ్యాయ బృందాన్ని కాపాడేందుకు అహర్నిశలు కృషి చేసిన శేఖర్‌రావు కృషి చేస్తున్నారని తెలిపారు. ట్రస్మా రాష్ట్ర నాయకుడు సంతోష్‌రావు జిల్లా నాయకుడు, హుజూరాబాద్ అధ్యక్షుడు. వి వెంకటేశ్వర్లు, కార్యదర్శి పి. రవీందర్ రెడ్డి, కోశాధికారి కోటేశ్వర్ యాదవ్, మాజీ అధ్యక్షుడు రాజ్ కుమార్ యాదవ్, సంపత్ రావు, నాయకులు మాడిశెట్టి ప్రసాద్, పాడి విజయపాల్ రెడ్డి, ఏనుగు మహిపాల్ రెడ్డి, మంచికట్ల గోపాల్, సతీష్, రవీందర్, విన్సెంట్, వెంగళరావు, కిరణ్ కుమార్, తిరుపతి యాదవ్, సమ్మయ్య పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


శంకర్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో 13 మంది లబ్ధిదారులకు గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ... ఎన్నికల హామీలు అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్‌పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డిదేనని అన్నారు. దశలవారీగా సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. అనంతరం కాంగ్రెస్‌పార్టీ గునుకులకొండాపూర్ గ్రామ అధ్యక్షుడిగా నాగపూరి శంకర్‌కు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, ఏవో కిరణ్మయి, పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, డైరెక్టర్లు మాతంగి అనిల్, పురంశెట్టి బాలయ్య, కనకయ్యగౌడ్, గ్రామ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, దుడ్డు మల్లేశం, బద్దం సంపత్‌రెడ్డి, తిప్పర్తి పరిపూర్ణాచారి, కుమ్మరి సంపత్, రవికుమార్, తిరుపతి, హన్మండ్ల నర్సయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయుల నిరసన


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

తిమ్మాపూర్: సమస్యల పరిష్కరించాలని గురుకుల ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో గురుకులాల ఎదుట గురువారం నిరసన చేపట్టారు. మ్మాపూర్ మండల కేంద్రంలోని మానకొండూర్ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల ఎదుట చేపట్టిన నిరసనలో యూటీఎఫ్ టెమ్రిస్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి, కార్యదర్శి కిన్నెర అనిత మాట్లాడారు. పాఠశాలలో పనిచేస్తున్న ప్రిన్సిపాళ్ల, జేఎల్‌లు, డిగ్రీ లెక్చరర్లకు గెజిటెడ్ హోదా కల్పించాలన్నారు. ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డ్స్, టీఎస్‌జీఎల్ఐ మంజూరు చేయాలని కోరారు. ముఖ్యంగా పాఠశాలల పనివేళల్లో మార్పు చేయాలని, ఆర్ట్ క్రాఫ్ట్ మ్యూజిక్, లైబ్రేరియన్, స్టాఫ్‌నర్స్‌కి ప్రమోషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపకుంటే 28న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాకు టీచర్లు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఓటరు లిస్టుపై అభ్యంతరాలు తెలపాలి


వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్ శారద

జమ్మికుంట: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భీమేష్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ముసాయిదా ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీలు, బీఎల్‌వోలతో గురువారం సమావేశం నిర్వహించారు.

చొప్పదండి: మండల పరిషత్ సమావేశ మందిరంలో ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో అధికారులు గురువారం సమీక్ష నిర్వహించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై, అవగాహన సమావేశం నిర్వహించారు.

రామడుగు: ఓటరు లిస్టుపై అభ్యంతరాలుంటే గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో ఈ నెల 21వ తేదీలోపు ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో రాజేశ్వరి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ హాల్‌లో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌వోలతో ఓటరు లిస్టుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సైదాపూర్: ఓటర్ జాబితా అభ్యంతరాలపై ఎంపీడీవో యాదగిరి, తహసీల్దార్ మంజుల గురువారం రాజకీయ పార్టీల నాయకులతో మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు.

ఇల్లందకుంట: గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీస్‌బోర్డులపై ఓటరు జాబితాను ప్రదర్శించాలని ఎంపీడీఓ పుల్లయ్య ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో పలురాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

శంకరపట్నం: రెండు గ్రామాల్లో ఓటరు జాబితా నిలిచిపోయినట్లు ఎంపీడీవో కృష్ణప్రసాద్ తెలిపారు. మండలంలోని మొలంగూర్ గ్రామంలో 10వార్డులకు 12వార్డులు, కొత్తగా ఏర్పడుతున్న అంబేడ్కర్‌నగర్‌లో ఆరు వార్డులకు నాలుగు వార్డులతో జాబితా తయారు కావడంతో రెండు గ్రామాల్లో ఓటరు జాబితా నిలిచిందన్నారు.

గన్నేరువరం: ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీలతో గన్నేరువరం గ్రామ పంచాయతీ ఆవరణలో ఎంపీడీవో శంకర్ సమావేశం నిర్వహించారు. డ్రాఫ్టుపై ఆయా పార్టీల సూచనలు, సలహాలు, విజ్ఞప్తులను స్వీకరించారు.

చిగురుమామిడి: ఓటరు జాబితాలో తప్పులను సవరించేందుకు రాజకీయపార్టీల నాయకుల సూచనలు,సలహాలు స్వీకరించి ఎన్నికల కమిషన్‌కు పంపిస్తామని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయా పార్టీల నాయకులతో అవగాహనా సమావేశం నిర్వహించారు.

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు జాబితాపై సమావేశం జరిగింది. శాలపల్లి–ఇందిరానగర్ గ్రామపంచాయతీలో ఓటరు లిస్టు వార్డుల వారీగా తప్పుగా ఉందని, ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని, వెంటనే సరిచేయాలని కోరుతూ మాజీ సర్పంచ్ కొడిగూటి శారద ప్రవీణ్‌కుమార్ ఎంపీడీవో సరితకు వినతి పత్రం సమర్పించారు.

సంక్షిప్త వార్తలు

'ఈటల' పరామర్శ

జమ్మికుంట: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని మాజీ మంత్రి, బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ గురువారం పరామర్శించారు. సమ్మిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సమ్మిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో గురువారం ప్రణవ్ పర్యటించారు. గ్రామంలోని సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లగా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వపరంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలోని సిర్సపల్లి గ్రామానికి చెందిన వంగ వర్షిత్ పటేల్ ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందగా మృతుడి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ గురువారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

బియ్యం అందజేత

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామానికి చెందిన ఆటో యూనియన్ అధ్యక్షుడు గుంటుక రాజేశం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం పద్మశాలీ సంఘం సభ్యులు మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి ఇరవై ఐదుకిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుంటుక లింగయ్య, ప్రధాన కార్యదర్శి బూర శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వొడ్నాల నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

మానకొండూర్: నేషనల్ హైవే పనుల్లో భాగంగా శుక్రవారం మండలంలోని ఖాదర్‌గూడెం, ఈదుల గట్టెపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని చెంజర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ మెరుగు రమేశ్ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ కారణంగా ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నూతన కమిటీ

శంకరపట్నం: మండలంలోని కాచాపూర్ సీతారామ చంద్రస్వామి దేవస్థానం చైర్మన్‌గా నాంపల్లి శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఆలయంలో నూతన కమిటీ ఎన్నిక సమావేశం నిర్వహించారు. శ్రీధర్‌ను చైర్మన్‌గా ఎన్నుకున్నామని సభ్యులు తెలిపారు.

వినాయక లడ్డూ రూ.43 వేలు


వినాయక లడ్డూతో జానవ్వ నారాయణ

తిమ్మాపూర్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పర్లపల్లిలో గురువారం వినాయక లడ్డు వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన గోపుగోని జానవ్వ నారాయణ రూ.43 వేలకు లడ్డు దక్కించుకున్నారు. ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని నారాయణ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ అధ్యక్షులు, నిర్వాహకులు, కమిటీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు, యువత, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలోని బీసీ కాలనీలో సోషల్ వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని వినాయక లడ్డు వేలం నిర్వహించారు. పున్నం సాయికుమార్ రూ.40,116 వేలంలో లడ్డు దక్కించుకున్నారు. సాయికుమార్‌ను కిషన్‌రెడ్డి, జనార్దన్,పోచంపల్లి సమ్మయ్య,శ్రీనివాస్, కనకయ్య అభినందించారు.

సమస్యల పరిష్కారానికి మార్గాలు అన్వేషించాలి


మాట్లాడుతున్న ప్రసన్న హరికృష్ణ

హుజూరాబాద్: శాసన మండలి రాజకీయ నిరుద్యోగులకు పునరావాస కేంద్రం కావొద్దని కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. గురువారం రాత్రి సిటీ సెంట్రల్‌హాల్‌లో నిర్వహించిన పట్టభద్రుల సమావేశంలో మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి మార్గాలను అన్వేషించాలని, ఎమ్మెల్సీగా గెలిపిస్తే గ్రాడ్యుయేట్స్ అందరూ శాసనమండలిలో ఉన్నట్టేనని అన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గోడిశాల పరమేశ్వర్, గ్రాడ్యుయేట్స్ పాల్గొన్నారు.

ముస్లింల ర్యాలీలు

మానకొండూర్: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లింలు గురువారం మానకొండూర్‌లో ర్యాలీ నిర్వహించారు. చెరువుకట్ట నుంచి పల్లెమీదుగా తూర్పు దర్వాజ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎండీ హజీక్, ఎండీ తాజొద్దీన్, ఎండీ బాబా, సోహైల్‌ఖాన్, ఆరీఫ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లింలు మసీదు నుంచి బస్టాండ్ మీదుగా ర్యాలీతీశారు.

స్వచ్ఛతాహీ సేవ

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రమేశ్ అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కళాశాల ఆవరణలోని పిచ్చిమొక్కలు, వ్యర్థ పదార్థాలను తొలిగించి, పరిసరాలను శుభ్రం చేశారు.

డాక్యుమెంట్లు ఇవ్వడం లేదని వాగ్వాదం


తహసీల్దార్‌తో వాదిస్తున్న రైతులు

శంకరపట్నం: రిజిస్ట్రేషన్ పూర్తయినా డాక్యుమెంట్లు ఇవ్వడం లేదని శంకరపట్నం తహసీల్దార్ భాస్కర్‌తో గురువారం రైతులు వాగ్వాదానికి దిగారు. మండలంలోని కరీంపేట గ్రామానికి చెందిన మేడిశెట్టి బక్కవ్వకు చెందిన 2.28 ఎకరాల వ్యవసాయ భూమిని కోడళ్లు రాజమ్మ, స్వరూప, మనువడు రాకేశ్, మనవరాళ్లు స్వప్న, రజిత, స్రవంతి, వనమాల పేరిట శంకరపట్నం తహసీల్దార్ కార్యాలయంలో ఆగస్టు 31న గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేశారు. అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు అడిగితే సాంకేతిక కారణాలు ఉన్నాయని, రేపుమాపు అంటూ ధరణి ఆపరేటర్ కిరణ్ తిప్పుకుంటున్నాడని తహసీల్దార్ ఎదుట ఆరోపించారు. ధరణి ఆపరేటర్, స్లాట్‌బుక్ చేసిన వ్యక్తి డబ్బులు వసూలు చేశారని తహసీల్దార్‌తో వాదనకు దిగారు. ధరణి ఆపరేటర్, ప్రైవేట్ వ్యక్తిని పిలిచి రైతులకు తహసీల్దార్ డాక్యుమెంట్లు ఇప్పించారు. ప్రయివేటు వ్యక్తి వసూలు చేసిన రూ.5900 రైతు అంకతి వీరకుమార్‌కు తిరిగి ఇచ్చాడు. తాను ఎవరిని డబ్బులు ఇవ్వమని అడగలేదని, ధరణి ఆపరేటర్ కిరణ్, స్లాట్‌బుక్ చేసిన వ్యక్తిపై విచారణ చేస్తానని తహసీల్దార్ భాస్కర్ పేర్కొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

చొప్పదండి: బీజేపీ సంస్థాగత సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ కోరారు. మండలంలోని పెద్దకూర్మపల్లిలో గురువారం పార్టీ మండల అధ్యక్షుడు మావురం సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో, చొప్పదండిలోని తెలంగాణ చౌరస్తాలో పట్టణశాఖ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు.

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి సభ్యత్వ నమోదు పార్టీ మండల నగునూరి శంకర్ ఆధ్వర్యంలో చేపట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

వీణవంక: మండలంలోని పలు గ్రామాలలో సభ్యత్వ నమోదును పార్టీ మండల అధ్యక్షుడు ఆదిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిశీలకులుగా జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సుహాసిని హాజరై బూత్ అధ్యక్షులకు పలు సూచనలు చేశారు.

జమ్మికుంట: సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని సుహాసిని కార్యకర్తలకు సూచించారు.

క్రైం వార్తలు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ఇల్లందకుంట: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం సాయంత్రం ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు... పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జంపేట గ్రామానికి చెందిన మండ సురేశ్(35)కార్ డ్రైవింగ్ చేస్తూ జమ్మికుంట మండలం కొత్తపల్లిలో నివాసం ఉంటు న్నాడు. బంధువుల ఇంటికెళ్లి కొత్తపల్లికి వస్తుండగా మల్రివానిపల్లి గ్రామం దాటిన తర్వాత కెనాల్ వద్ద బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డాడు. తలకు త్రీవ గాయం కాగా 108లో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

ముగ్గురిపై వరకట్న వేధింపు కేసు

జమ్మికుంట: అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు పాల్పడుతున్న ముగ్గురిపై గురువారం కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు. మండలంలోని బిజిగిరిషరీఫ్ గ్రామానికి చెందిన ఎండీ సమీనాకు అదే గ్రామానికి చెందిన సమీర్‌తో పదినెలల క్రితం వివాహమైంది. నెల రోజులుగా భర్త, అత్తమామలు అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు పాల్పడుతుండడంతో బాధితురాలి ఫిర్యాదుతో భర్త, అత్తమామలపై కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

ఎంగేజ్‌మెంట్‌కు పిలవలేదని దాడి

జమ్మికుంట: కూతురు ఎంగేజిమెంట్‌కు పిలవలేదని ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన మండలంలోని వావిలాల గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ వరంగంటి రవి తెలిపిన వివరాలు.. వావిలాల గ్రామానికి చెందిన పెరుగు శ్రీనివాస్ ఆగస్టు 9వ తేదీన తన కూతురు నిశ్చితార్థం నిర్వహించాడు. బుధవారం సాయంత్రం శ్రీనివాస్ చికెన్ సెంటర్ వద్ద కూర్చొని ఉండగా పెరుగు సిజిత్ మద్యం మత్తులో అసభ్యపదజాలంతో గొడవకు దిగాడు. ఎంగేజ్‌మెంట్‌కు ఎందుకు పిలవలేదని కర్రతో దాడి చేయగా శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. అడ్డొచ్చిన్న శ్రీనివాస్ భార్య సుజాతపై దాడికి పాల్పడ్డాడు. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు గురువారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

డబ్బులు ఇప్పించాలంటూ ఫిర్యాదు

హుజూరాబాద్‌రూరల్: సీడ్ ఆర్గనైజర్ నుంచి డబ్బులు ఇప్పించాలంటూ మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన ఇరుమల్ల సురేందర్‌రెడ్డి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓ కంపెనీకి చెందిన ఆర్గనైజర్లు తనకున్న ఆరెకరాల్లో ఎకరాకు రూ.1.20 లక్షల దిగుబడి వస్తుందని ఆశ చూపి సీడ్ సాగు చేయించారని, పంట వద్దకు రమ్మని ఎన్నిసార్లు ఫోన్ చేసిన స్పందించలేదన్నారు. పురుగు ఉధృతిని తగ్గించేందుకు ఎనిమిది సార్లు మందులు పిచికారీ చేయగా దిగుబడి తగ్గిందని, దీనిపై మాట్లాడితే కంపెనీతో మాట్లాడి ఒప్పందం ప్రకారం డబ్బులు ఇస్తామని చెప్పి ఫోన్ లిఫ్ట్ చేయటం లేదన్నారు. తనకు తెలియకుండానే ఖాతాకు రూ.నాలుగు లక్షలకుపైగా నగదు పంపించారని, మిగతా నగదుపై ఆర్గనైజర్స్ స్పందించడం లేదన్నారు. వచ్చిన డబ్బులనుఆర్గనైజర్‌కు చెక్కు రూపంలో అందించానని తెలిపాడు. గ్రామంలో మరో యాభై మంది రైతులను ఇలానే మోసం చేశారని, వీరిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు.

175 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

తిమ్మాపూర్: రేషన్ బియ్యం తరలిస్తున్న డీసీఎం వ్యాన్‌ను సివిల్ సప్లయ్ విజిలెన్స్ అధికారులు గురువారం మండల కేంద్రంలో పట్టుకున్నారు. వ్యాన్‌లో 175 క్వింటాళ్ల బియ్యం ఉన్నాయని, రేకుర్తి నుంచి సిద్దిపేట వరకు వెళ్లిన తర్వాత ఫోన్ చేస్తే బియ్యాన్ని ఎక్కడికి తరలించాలో చెబుతామని సంబంధిత యజమాని చెప్పినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. మంథని నుంచి రేషన్ బియ్యంతో వస్తున్న మరో వాహనాన్ని అధికారులు పట్టుకున్నారు. అనంతరం వాహనాలను సివిల్ సప్లై గోదాములకు తరలించి డ్రైవర్లను పోలీసులకు అప్పగించారు. దాడుల్లో హైదరాబాద్ సివిల్ సప్లై శాఖలోని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్డీ (అడిషనల్ ఎస్పీ) ఎం.ప్రభాకర్, స్పెషల్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి, ఎస్సైలు జంగయ్య, కృష్ణ పాల్గొన్నారు.

సైదాపూర్: మండలంలోని ఎలబోతారంలో ఓ మహిళా సంఘం గణకురాలు ఇంట్లో నిల్వచేసిన ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని పక్కా సమాచారంతో గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ బియ్య దందా నిర్వహిస్తున్న బత్తుల భిక్షపతి, రాజయ్య, స్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.